నమో సూర్య దేవ

• ఘనంగా రథసప్తమి వేడుకలు



మెరకముడిదాం: సోమలింగాపురంలో సూర్యనారాయణమూర్తిస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు శ్రీనివాసశర్మ



శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఆదిత్యుని ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



శృంగవరపుకోట: ఎస్.కోటలోని ఆదిత్యుని ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు



వేపాడ: వేపాడ రామాలయం లో పూజలందుకుంటున్న సూర్యనారాయణమూర్తి స్వామి



కొత్తవలస: తుమ్మికాపల్లిలోని ఓంసదనంలో పూజలు చేస్తున్న భక్తులు



గజపతినగరం: గజపతినగరం కుమ్మరి వీధిలోని ఓ ఇంటి వద్ద రథసప్తమి పూజలు

మెరకముడిదాం: సోమలింగాపురం గ్రామంలోని సూర్యనారాయణమూర్తి స్వామివారి ఆలయంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి ప్రధాన అర్చకుడు అరవిల్లి కృష్ణశాస్త్రి తోమాలసేవ చేశారు. ధర్మకర్త ఎస్.వి.రమణరాజు దంపతులు, ఆయన సోదరులతో స్వామివారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేయించారు. అనంతరం స్వామివారికి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాదిమంది మహిళలు ఆలయ ప్రాంగణంలో పొయ్యిలు పెట్టి పాలు పొంగించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: పట్టణంలోని ఆదిత్యుని ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారక ముందే పలువురు భక్తులు స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఉన్న యాజ్ఞవల్క్య సహిత సూర్యదేవాలయంలో బారులు తీరారు. ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు నివేదించారు. భక్తులతో అర్చకులు విన్నకోట సూర్యనారాయణ శర్మ, రెడ్డి అయ్యప్ప తదితరులు స్వామికి పూజాదికాలు చేయించారు. అలాగే గ్రామదేవత ధారగంగమ్మ ఆలయానికి మహిళలు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప లువురు ఇళ్ల వద్ద జిల్లేడు ఆకులుపైన, రేగుపండ్లు ఉంచి అభ్యంగన స్నానాలు చేశారు. పిడకల పొయ్యిలపై పాలు పొంగించి, క్షీరాన్నం వండి సూర్యభగవానుడికి నివేదించారు.

• **వేపాడ:** మండల కేంద్రంలోని రామాలయంలో అర్చకులు గోపాజోస్యుల సాయిరాం ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. సూర్యభగవానుడికి భక్తులతో విశేష పూజలు చేయించారు.

• **కొత్తవలస:** తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓంసదనం ఆశ్రమంలో వేద పండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సూర్యనారాయణమూర్తి స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. సౌరహోమం నిర్వహించడంతో పాటు భక్తులతో సూర్యనమస్కారాలు చేయించారు.

• **గజపతినగరం:** మండల వ్యాప్తంగా రథసప్తమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. పురిటిపెంట మండల వారి కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి క్షీరాబిషేకం చేశారు.

కొందరికే కందిపప్పు..!

• రేషన్ కందిపప్పు సరఫరాలో కోత..
• 15శాతం లబ్ధిదారులకు మాత్రమే సరిపడేలా సరఫరా
• గంట్యాడ మండలంలో రైస్ కార్డుల సంఖ్య 20,161.. సరఫరా చేసింది 3024 కిలోలు
• మండలంలోని 43 మంది డీలర్లలో కందిపప్పు విడిపించింది ముగ్గురే



ప్రభుత్వం సరఫరా చేసిన కందిపప్పు

గంట్యాడ: అధికారంలోకి వస్తే గతంలో కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని కూటమి నేతలు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త సంక్షేమ పథకాల మాట దేవుడెరుగు ఉన్న పథకాల్లోనే కూటమి సర్కార్ కోత విధిస్తోంది. రైతులకు సాగు పెట్టుబడి కోసం ఏటా అన్న దాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. బడికి వెళ్లే ప్రతీ విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు కానీ వాటి ఊసే ఎత్తడం లేదు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి..తాజాగా పేదలకు అందించే రేషన్ సరుకుల్లో ప్రభుత్వం కోత పెట్టింది. ప్రధానంగా రేషన్ షాపుల ద్వారా అందించే రాయితీ కందిపప్పును ప్రజలు ఎక్కువగా తీసుకుంటారు. కంది పప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి కిలో రూ.150 నుంచి 180 వరకు ఉంది. రేషన్ షాపుల్లో రాయితీపై కిలో రూ. 67కి అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం కొన్ని నెలలుగా రేషన్ డిపోలకు సరఫరా చేసే కందిపప్పులో కోత విధిస్తోంది.

ముందుకు రాని డీలర్లు

మండలంలోని 43 రేషన్ డిపోల పరిధిలో 20,161 రైస్ కార్డులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం రైస్ కార్డుకు కిలో చొప్పున కందిపప్పు అందించాలంటే 20,161 కిలోలు అవసరం. కానీ ఫిబ్రవరి నెలకు సంబంధించి మండలానికి 3024 కిలోలు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. దీంతో రేషన్ డీలర్లు కందిపప్పు విడిపించడానికి ముందుకు రాలేదు. 15 శాతం మంది కార్డుదారులకే కందిపప్పు ఇస్తే మిగతా 85 శాతం మంది తమని నిలదీస్తారని, తాము వారికి సమాధానం చెప్పలేమని, అందుకే పూర్తిగా విడిపించడానికి ముందుకు రాలేదని పలువురు డీలర్లు అంటున్నారు. 43 రేషన్ డిపోల డీలర్లలో వసంత, దిగువ కొండపర్తి, పెద మజ్జిపాలెం డిపోల డీలర్లు మాత్రమే కందిపప్పు విడిపించారు. మిగతా 40 మంది విడిపించలేదు. గత నెల 60 శాతం కార్డులకు కంది పప్పు వస్తే ఈనెల 15 శాతమే సరఫరా కావడం గమనార్హం.

15 శాతమే వచ్చింది

ఫిబ్రవరి నెలకు సంబంధించి మండలానికి 15 శాతం మాత్రమే కందిపప్పు సరఫరా అయింది. ముగ్గురు డీలర్లు విడిపించారు. మిగతావారు విడిపించలేదు.

– మూర్తి, సిఎస్‌డీటీ, గంట్యాడ

జాతర సంగతేంటి ...?





కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం(ఇన్‌సెట్‌లో) అమ్మవారు

• కనకమహాలక్ష్మి జాతరను పట్టించుకోని పాలకులు
• తేదీలు కూడా వెల్లడించని దేవదాయశాఖ
• గతంలో సంక్రాంతి కాగానే పోస్టర్ల రిలీజ్, ప్రచారం

చీపురుపల్లి: అమ్మవారి జాతర సంగతి ఏంటి...అసలు జరుగుతుందా లేదా..? గతంలో సంక్రాంతి పండగ అవ్వగానే జాతర తేదీలు ప్రకటించి పోస్టర్లు రిలీజ్ చేసేవారు కదా... కానీ ఈ ఏడాది ఇంతవరకు తేదీలు ప్రకటించకపోవడం ఏంటి..? ఇదీ చీపురుపల్లి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర నిర్వహణపై భక్తుల్లో ప్రస్తుతం జరుగుతున్న చర్చ. భక్తుల కొంగుబంగారం, కోర్కెలు తీర్చే కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర కోసం చీపురుపల్లితో పాటు విజయనగరం జిల్లానే కాదు ఉత్తరాంధ్రతో పాటు ఒడిసా, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల్లోని భక్తులూ ఎదురు చూస్తుంటారు. దశాబ్దాలుగా ఏటా నిర్వహించే జాతరకు చీపురుపల్లి పట్టణ వాసులు అంతా తమ బంధువులు, ఆడపిల్లలను ఆహ్వానించడం, మొక్కులు తీర్చుకోవడం సాంప్రదాయంగా జరుగుతుంటోంది. ఏటా మహాశివరాత్రి ముగిసిన తర్వా త వచ్చే ఆదివారం, సోమవారం, మంగళవారం జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇది భక్తులందరికీ తెలిసిందే. ఈ లెక్క ప్రకారం మార్చి 2, 3,4 తేదీల్లో జాతర జరగాల్సి ఉంది. గతంలో సంక్రాంతి పండగ అవ్వగానే పాలకులు, దేవదాయశాఖ అధికారులు సమన్వయంతో తేదీలు ప్రకటించే వారు. కానీఈ ఏడాది ఇంతవరకు దేవదాయశాఖ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దేవదాయశాఖ ముందుకు రానప్పుడు కనీసం పాలకులైనా పట్టించుకోవాలి కదా అని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎంతో ప్రతిష్ఠ కలిగిన అమ్మవారి జాతర వైభవాన్ని ఇలా తగ్గించడమేంటనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి.

కానరాని జాతర హడావుడి.

గతంలో ఎప్పుడూ జాతర నిర్వహణకు నెల రోజుల ముందు నుంచే దేవస్థానం వద్ద హడావుడి కనిపించేది. సంక్రాంతి పండగ ముగియగానే తేదీలు ప్రకటిస్తూ పోస్టర్లు రిలీజ్ చేసి విరివిగా ప్రచారం చేసేవారు. జాతరలో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రచారంతో పాటు దేవస్థానం వద్ద వినోద కార్యక్రమాల ఏర్పాటు వంటి హడావుడి కనిపించేది. కానీ ఈ ఏడాది సమయం దగ్గరపడుతున్నా ఎలాంటి హడావుడి కనిపించడం లేదు.గతంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని, పాలకులు స్పందించకపోవడంపై భక్తుల నుంచి భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

మార్చి 8వ తేదీన మెగాలోక్ అదాలత్



పోలీసులతో సమావేశమైన జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవం తం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి పోలీస్ అధికారులను కోరారు. స్థానిక కోర్టులో గజపతినగరం సర్కిల్ పరిధిలోని సీఐ,ఎస్ఐలతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సివిల్,క్రిమినల్, తదితర కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. కేసులకు సంబంధించి ఇరువర్గాల్లోని కక్షిదారులకు అవగాహన కల్పించి, రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు.

సేవలను వినియోగించుకోండి



ఎస్.కోటలో ఎస్‌బీఐ సర్వీస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

శృంగవరపుకోట: భారతీయ స్టేట్ బ్యాంక్ అందిస్తున్న సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని ఎల్‌హెచ్‌ఓ అమరావతి సర్కిల్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, ఎఫ్ఐసీ మేనేజర్ మురళీకృష్ణ కోరారు. మండలంలోని పలు ఎస్‌బీఐ సర్వీస్ సెంటర్లను మంగళవారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా ఖాతా దారులు, సర్వీస్ సెంటర్ల ఆపరేటర్లతో మాట్లాడుతూ ఇటీవల భారతీయ స్టేట్‌బ్యాంక్ ఐవీఆర్ఎస్‌లో 40 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు.సేవల్లో లోపాలు, బ్యాలెన్స్ విచారణకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ 180001234ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సేవా కేంద్రాల్లో ఎస్‌బీఐ సేవలకు సంబంధించిన పోస్టర్లను ఉంచాలని, ఖాతాదారులకు సకాలంలో సేవలందిం చా లని ఆపరేటర్లకు సూచించారు. ఎస్‌బీఐ అధికారులు బాలాజీ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సీఐ శంకరరావు

మెరకముడిదాం: సైబర్ నేరాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని, వాటి నియంత్రణపై పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ సచివాలయ మహిళా పోలీసు లు ప్రత్యేక దృష్టిసారించాలని చీపురుప ల్లి సీఐ జి.శంకరరావు సూచించారు. బుధరాయవలస పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన సచివాలయ మహి ళా పోలీసులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు.గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి నిఘా ఉంచాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఎంపీడీఓ జి.భాస్కరరరావు, తహసీల్దార్ అజూరఫీజాన్, ఎస్ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులను గుర్తించండి



మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

గుర్ల: గ్రామాల్లో క్యాన్సర్, ఫైలేరియా, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత ఆశ వర్కర్లపై ఉందని జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ అన్నారు. తెట్టంగి పీహెచ్‌సీలో సిబ్బంది, ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు వస్తున్న అనారోగ్య సమస్యలను తెలుసుకొని ప్రథమ చికిత్సలో భాగంగా మందులు అందజేయాలన్నారు. సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.జోనల్ ఎంపీఈఓ తిరుపతిరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరగాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ నాగభూషణం సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశమయ్యారు. జీఓ నంబర్ 117 అమలుపై వివరించారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు సిలబస్ పూర్తి చేయాలని, వర్కుబుక్స్‌లో ప్రతీ వరుసను రెడ్ పెన్‌తో సరిచేయాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఎంఈఓ-2 బాలభాస్కరరావు, నీలకంఠరాజపురం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్‌వెంకటరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యపనులు

• సాక్షి ఎఫెక్ట్

వేపాడ: మండల కేంద్రంతో పాటు వల్లంపూడి జంట గ్రామాల మధ్య శివాలయం వీధిలో పారిశుద్ధ్య సమస్యపై 'రోడ్డుపైనే మురుగు ప్రవాహం' శీర్షికతో సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన వల్లంపూడి పంచాయతీ కార్యదర్శి పద్మావతి శివాలయం వీధి కాలువల్లో మంగళవారం పూడిక తీయించి, చెత్తచెదారం తొలగించారు.

• పోలింగ్ కేంద్రాల పరిశీలన



గంట్యాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కీర్తి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గంట్యాడ, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాన్ని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి మంగళవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు, ఫర్నీచర్, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అంతా సహకరించా లని అధికారులను కోరారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓ వెంట గంట్యాడ, ఎల్.కోట,కొత్తవలస మండలాల తహసీల్దార్‌లు నీలకంటేశ్వర రెడ్డి, ప్రసాదరావు, నీలకంఠరావు, వేపాడ ఉపతహసీల్దార్ సన్యాసినాయుడు, తదితరులు ఉన్నారు.

– గంట్యాడ/లక్కవరపుకోట/కొత్తవలస/వేపాడ

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

కొత్తవలస: మంగళపాలెంలో గ్రామానికి చెందిన శ్రీగౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ పుష్పాలు,కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక భక్తి భజన బృంద సభ్యులు తెల్లవారు జామునించి సాయంత్రం వరకు భజనలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం నాగార్జున

గంట్యాడ: రైతులు వ్యవసాయంతో అనుబంధ రంగాలపై దృష్టి సారించి ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకోవాలని నాబార్డు డీడీఎం నాగార్జున సూచించారు. మండలంలోని మురపాక గ్రామంలో పాలరైతులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ రైతులంతా సంఘటితంగా ఉండేందుకు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సంఘాల నిర్వహణ, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనుసరించా ల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఈదుబిల్లి రమేష్ , స్థానిక నాయకులు రమణ,తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అలసత్వం వహించొద్దు



గంట్యాడ: ర్యాలీ చేస్తున్న గంట్యాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు

గంట్యాడ: క్యాన్సర్‌పై అలసత్వం వహించరాదని, వ్యాధిలక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే నయం చేయవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు హేమలత, వెంకటేష్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ఒక్కటే మార్గం...

శృంగవరపుకోట: క్యాన్సర్‌ను అధిగమించేందుకు అవగాహన ఒక్కటే మార్గమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మద్యపానం, ధూమపానం, వాయు కాలుష్యం, జలకాలుష్యం, మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి వల్ల క్యాన్సర్ సంక్రమిస్తోందన్నారు. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

కొత్తవలస: క్యాన్సర్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు, ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా వియ్యంపేటలో పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు.ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, జంక్ ఫుడ్‌కు, పొగాకు ఉత్పత్తులు, మద్యానికి దూరంగా ఉండాలని వైద్యాధికారి చెప్పారు. గ్రామపెద్దలు పులిబంటి రాము, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గజపతినగరం: మండల కేంద్రంలోని దిగువ వీధిలో పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు రెండో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. అప్పలనరసయ్యకు ఆలయ ధర్మకర్త కందుల చిన్నయ్యస్వామి స్వాగతం పలికి ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీఅన్నదానం చేశారు. గజపతినగరంతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకుడు వేమలి ముత్యాలనాయుడు, తుమికాపల్లి,కాలంరాజుపేట సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు,గేదెల ఈశ్వరరావు, స్థానిక వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, నాయకులు కర్రి కళావతి,,గేదెల ఈశ్వరరావు, బోడసింగి జగదీష్,కర్రి నానాజీ, శీర రమణ,బి.వాసు పాల్గొన్నారు.

ఎఫ్‌డీఐ పెంపుపై నిరసన



శృంగవరపుకోట: ఎస్.కోట ఎల్ఐసీ కార్యాలయం వెలుపల భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు




చీపురుపల్లిరూరల్ (గరివిడి): నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు

శృంగవరపుకోట/చీపురుపల్లిరూరల్ (గరివిడి): బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) 100 శాతానికి పెంచుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్లో ప్రతిపాదన చేయడం భారతీయ భీమా రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎల్ఐసీ ఉద్యో గులు అన్నారు. ఎస్.కోట, గరివిడిలోని ఎల్ఐసీ కార్యాలయాల వద్ద ఎల్ఐసీ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74శాతం నుంచి 100 శాతానికి పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారని, ఈ నిర్ణయంతో దేశీయ బీమా సంస్థలు నిర్వీర్యమవుతాయన్నారు. దేశఆర్థిక వ్యవస్థ కొంత మంది పెట్టుబడిదారులు, బ్యాంకర్ల చేతిలోకి వెళ్లిపోయే పెను ప్రమాదం ఉందన్నారు. ఎస్.కోట, గరివిడి బ్రాంచ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

• సూర్య నమస్కారాలు



సాధకులతో సూర్యనమస్కారాలు చేయిస్తున్న కోటేశ్వరరావు



సూర్యనమస్కారాలు చేస్తున్న కౌముది స్కూల్ విద్యార్థులు

రథసప్తమి సందర్భంగా ఎస్.కోటలోని మోక్ష విద్య యోగమందిర్ నిర్వాహకులు శీలా కోటేశ్వరరావు నేతృత్వంలో మంగళవారం సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ఒక్కోరౌండ్ కు 12 ఆసనాలు చొప్పున 108 ధపాలు ఆసనాలు వేసి సూర్యనమస్కారాలు చేశారు. 15రోజులుగా సాధకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సూర్యనమస్కారాలు చేయించామని యోగా ట్రైనర్ కోటేశ్వరరావు చెప్పారు. సూర్యనమస్కారాలు చేయడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందని, శరీర రుగ్మతలు తొలగి శరీర వ్యవస్థలు ఉత్తేజితమవుతాయని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అలాగే పట్టణంలోని కౌముది గ్లోబల్ స్కూల్‌లో విద్యార్థులతో సూర్యన మస్కారాలు చేయించారు.

– శృంగవరపుకోట